కల్యాణం.. వైభోగం


నృత్యం చేస్తున్న కళాకారులు


రథోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- పరవశించిన భక్తజనం
- సింహగిరిపై ఆధ్యాత్మిక శోభ

సింహాచలం: సింహగిరి పులకించిపోయింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణం కనులారా వీక్షించడానికి తరలివచ్చిన భక్తజనంతో కళకళలాడింది. ఎటు చూసినా ఆధ్యాత్మిక శోభ.. కల్యాణ కాంతులు కనిపించాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొని తరించారు. మధ్యాహ్నం 3 గంటలకు కొట్నాల ఉత్సవంతో ప్రారంభమైన కల్యాణోత్సవాలు రాత్రి జరిగిన కల్యాణ వేడుకతో ముగిశాయి.

దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ముత్తైదువులు, అర్చకులు పసుపుకుంకుమలు దంచి కొట్నాల ఉత్సవాన్ని నిర్వహించారు. తదుపరి సింహగిరి మాడ వీధుల్లో ఎదురు సన్నాహోత్సవం, రథోత్సవం, నృసింహ మండపంలో కల్యాణోత్సవం వైభవంగా జరిగాయి. కల్యాణోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.


రథోత్సవంలో స్వామిని దర్శించుకున్న విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి


కొట్నాల ఉత్సవంలో పసుపుకొమ్ములు దంచుతున్న మహిళలు, ఈవో త్రినాథరావు


శివుడి అలంకరణలో సాంస్కృతిక కార్యక్రమం

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఈవో


పరీక్ష కేంద్రంలో పరిశీలన చేస్తున్న డీఈవో చంద్రకళ

సింహాచలం: పెందుర్తి మండలంలోని పదోతరగతి పరీక్షలు జరిగే పలు కేంద్రాలను ఆదివారం డీఈవో చంద్రకళ పరిశీలించారు. పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్, గుర్రంపాలెం, సరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లను ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ఏవిధంగా ఏర్పాట్లు చేశారో స్వయంగా పరిశీలించారు. ప్రతీ కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆమె చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

ఆరిలోవ: మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తోటగరువు సమీప గాంధీనగర్‌లో వాసుపల్లి వరలక్ష్మి(47), భర్త ఉమాపతి నివాసముంటున్నారు. వీరికి పిల్లలు లేరు. ఉమాపతి రిటైర్డ్ డాక్‌యార్డ్ ఉద్యోగి. వరలక్ష్మి చీరల వ్యాపారం చేసేది. చీరలు అరువు పద్ధతి విక్రయించేంది. ఈ డబ్బులు వసూలు కాకపోవడంతో వ్యాపారంలో నష్టం వచ్చింది. ఆర్థిక ఇబ్బందులకు గురైంది. దీనికి తోడు ఆరోగ్యం కూడా బాగోకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉమాపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉక్కు నిర్వాసిత కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉక్కు నిర్వాసిత కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమతానగర్‌లో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లోని ఎనిమిది డిపార్టుమెంట్లలో పని చేస్తున్న నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే పని కల్పించాలని కోరారు. అలాగే వారికి ఉక్కు యాజమాన్యం నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించని శ్రద్ధా, కళింగ కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు చెల్లించిన డబ్బులను యాజమాన్యం అట్టే పెట్టుకోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. తక్షణమే ఫైనల్ బెనిఫిట్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు భద్రత కల్పించాలని, ప్రమాదశాత్తూ ఎవరైనా మరణిస్తే రూ.20లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డు పైడిరాజు, కండేపల్లి రాజు, కె వేణుగోపాల్‌రెడ్డి, వి.సన్యాసిరావు, గొందేశివేణురెడ్డి, పేర్ల నూకరాజు, వెంకీ నాయుడు, అప్పలరాజు, రమణ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యాచకుడి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని యాచకుడు

గోపాలపట్నం: గుర్తు తెలియని యాచకుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గోపాలపట్నం బంక్ సెంటర్‌లో సుమారు 60 ఏళ్ల ఉండే గుర్తు తెలియని యాచకుడిని శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గోపాలపట్నం పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివరాలు తెలిస్తే 9440796020 నంబర్‌కు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

నిలిచిన కాలువ పనులు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పరవాడ: మండలంలో పి.బోనంగి గ్రామంలో పంచాయతీ నిధులతో చేపట్టిన మురుగు కాలువ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలల కిందట పంచాయతీ నిధులు సుమారు రూ.6.5 లక్షల వ్యయంతో గ్రామంలో మురుగు కాలువ నిర్మాణ పనులకు పాలకవర్గం శ్రీకారం చుట్టింది. కాలువ నిర్మాణానికి సన్నద్ధమైన సమయంలో కాలువ నిర్మాణం చేపట్టిన స్థలం తనదంటూ గ్రామ మాజీ సర్పంచ్ నిర్మాణ పనులను అడ్డగించారు. దీంతో పనులకు బ్రేక్ పడింది. దీంతో కాలువ నిర్మాణం చేపట్టదలచిన స్థలాన్ని పరిశీలించి హద్దులు నిర్ణయించి సమస్య పరిష్కరించాలని పంచాయతీ పాలక వర్గం రోడ్లు భవనాల శాఖ, రెవెన్యూ శాఖలను రాతపూర్వకంగా కోరింది. సదరు స్థలాన్ని ఇరు శాఖల అధికారులు పరిశీలించినా ఇంత వరకూ ఎలాంటి నివేదిక బయట పెట్టలేదు. దీంతో కాలువ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఫలితంగా కాలువలో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు బెడద విపరీతంగా పెరిగడంతో పాటు దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాడుక నీరు రోడ్ల పైకి విడిచిపెట్టడడంతో రహదారి గోతులమయంగా మారుతోంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని సర్పంచ్ బండారు కల్పనారాజశేఖర్ వాపోయారు. కాలువ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నామని సర్పంచ్ కల్పనరాజశేఖర్ చెప్పారు.


అసంపూర్తిగా నిలిచిపోయిన మురుగు కాలువ నిర్మాణం

ఘనంగా మట్టల ఆదివారం


రావలమ్మపాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు


సబ్బవరంలోని రోమన్ క్యాథలిక్ చర్చిలో..

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. సబ్బవరంలోని రోమన్ క్యాథలిక్ చర్చిలో ఫాదర్ బాలశౌరి ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొబ్బరి మట్టలను ఆశీర్వదించి ప్రార్థనలు,గీతాలను ఆలపిస్తూ క్రైస్తవులు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ ఇజ్రాయెల్ ప్రజలకు రాజుగా క్రీస్తు ప్రభువును కొలుచుకునే సమయంలో ఈ రోజున గర్వం లేని దేవుడిగా ప్రభువును గాడిదపై ఊరేగిస్తూ పండగ చేసుకున్నారని వివరించారు. అలాగే రావలమ్మపాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాస్టర్ పువ్వుల విజయ కుమార్.. గొటివాడలోని ఫేత్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ ఎం. మాణిక్యాలరావు క్రీస్తు సందేశం వినిపించారు.సబ్బవరం సాయినగర్ చర్చిలో జరిగిన ప్రార్థనలో పాస్టర్ ఎం. డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో భూ వివాదాలకు చెక్

డ్వామా పీడీ సందీప్

సబ్బవరం: సమగ్ర రీ సర్వేతో గ్రామాల్లో భూ వివాదాలకు చెక్ పడతాయని డ్వామా పీడీ సందీప్ అన్నారు. మండలంలోని రాయపుర అగ్రహారంలో సమగ్ర రీ సర్వేలో భాగంగా చేపట్టిన హద్దురాళ్ల పాతే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ఈ సర్వే చేపట్టిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన కొలతలతో సేర్వ చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామ భౌగోళిక పరిస్థితులతో పాటు సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.త్వరితగతిన ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, మండల సర్వేయర్ కె. శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎం. శ్రీనివాసరావు, వీఆర్వో అప్పారావు, టెక్నికల్ అసిస్టెంట్ జి. విశాలాక్షి, ఫీల్డ్ అసిస్టెంట్లు కె. హైమావతి,వి. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సర్వే రాళ్లు పాతుతున్న ఉపాధి కూలీలకు సూచనలిస్తున్న పీడీ సందీప్

నిర్వాసిత గ్రామాల్లో ఎన్టీపీసీ సేవలు


ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న సంస్థ జీజీఎం సిన్హా(ఫైల్)


వాడచీపురుపల్లిలో నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్స్


రాముడిగారిదొడ్డిలో నిర్మించిన మంచినీటి పథకం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో నిర్వాసిత గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి వారికి అండగా నిలుస్తోంది. ముఖ్యంగా తాగునీరు, విద్య, వైద్యం, డ్రైనేజీలు, కమ్యూనిటీ టాయిలెట్లు, సీసీ రహదారులు, వాటర్ ట్యాంకులు, వాటర్ ప్లాంట్లు, వైద్య ఆరోగ్య శిబిరాలు, మొబైల్ హెల్త్ యూనిట్లు వంటి సదుపాయాలు కల్పించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందజేస్తుంది. పరవాడ, వాడచీపురుపల్లి, దేవాడ పీహెచ్‌సీలను ఆధునికీకరించి రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించింది. సింహాద్రి నిర్వాసిత గ్రామాలను సీఎస్సార్ నిధుల ద్వారా అభివృద్ధి చేయడానికి సంస్థ కట్టుబడి ఉందని జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పేర్కొన్నారు.

'ఉద్యోగాల పేరిట బీజేపీ మోసం'


ఏఐవైఎఫ్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ ఎస్.మధురెడ్డి

మద్దిలపాలెం: ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి కేంద్రంలో గద్దెనెక్కిన బీజేపీ యువతను మోసం చేసిందని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎస్.మధురెడ్డి ఆరోపించారు. మద్దిలపాలెంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే యువతకు సంవత్సరం కాలం వ్యవధిలో రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. వంద రోజుల్లో నిత్యావసర వస్తువులు ధరలను తగ్గిస్తామని నమ్మబలికారన్నారు. ప్రతి పేదవాడి అకౌంట్లో రూ.15లక్షలు వేస్తామని మోసం చేశారని విమర్శించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు కెల్లా రమణ, బన్ని, తేజా, నిశాంతు, వినయ్, కిరణ్, వైకుంఠరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు సంకల్పంతో పోరాడతాం

కూర్మన్నపాలెం: ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం విశాఖ ఉక్కు జోలికి ఎవరూ రాలేరని, అలా వచ్చిన కేంద్రానికి తగిన గుణపాఠం చెబుతామని ఏఐటీయూసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద విశాఖ స్టీల్ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 780వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహ తహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే అన్ని వర్గాల కార్మికులతో పాటు, ఉక్కు నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నందిక తాతారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబాబు, అడిషనల్ జనరల్ సెక్రటరీ మురళీకృష్ణ, కోశాధికారి నాగరాజు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ పల్లా మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అక్కిరెడ్డిపాలెం: గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆటోనగర్ చట్టివానిపాలెం సర్వీసు రోడ్డు పక్కన కేబుల్స్ నిర్మాణం చేస్తున్న గోతిలో పడి అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఏ.సాయి (27) గాయపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం అర్ధరాత్రి మృతి చెందాడని గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు.

సత్యసాయి భక్తుల రక్తదానం

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అత్యవసర రోగులకు అందించేందుకు వీలుగా ఈ శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమ సదన్‌తో పాటు బీహెచ్ఈఎల్ ప్రాంతంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా శిబిరాల ద్వారా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకులు వంద యూనిట్లు రక్తాన్ని సేకరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.


రక్తదానం చేస్తున్న శ్రీ సత్యసాయిబాబా భక్తులు

శాంతి కోసం సైకిల్ యాత్ర

సబ్బవరం: దేశంలో శాంతి నెలకొల్పాలని,ఘర్షణలు లేకుండా చూడాలని ప్రార్థిస్తూ ఆయన దేశంలోని పలు రాష్ట్రాలను చుట్టేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రముఖ ఆలయాలను దర్శించుకుని దేవుళ్లను ప్రార్థిస్తున్నారు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లా సింధునూరు పట్టణానికి చెందిన విజయ్ గోపాలకృష్ణ. గతేడాది మార్చి 11వ తేదీన సింధునూర్‌లో ఈ యాత్ర ప్రారంభించారు. అక్కడ నుంచి బయలదేరి దాదాపు 11 రాష్ట్రాలను చుట్టేశారు. ఉదయం పర్యటన మెదలు పెడుతూ మధ్యాహ్నం కాస్త విశ్రాంతి తీసుకుంటూ అనంతరం మళ్లీ ప్రమాణం సాగిస్తున్నారు.ఇప్పటివరకూ ఘనాపూర్, తుల్జాపూర్,షిర్డీ,నాసిక్,త్రయంభకేశ్వరం,గుజరాత్ రాష్ట్రంలోని నర్మదానది,నాందేడ్‌తో పాటు విజయవాడ కనకదుర్గమ్మ,అన్నవరం సత్యనారాయణను దర్శించుకున్నారు. సబ్బవరం మీదుగా శ్రీకాకుళంలోని సూర్యనారాయణ స్వామిని దర్శించుకోనున్నారు. యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం సబ్బవరం చేరుకున్నారు. సబ్బవరంలోని శ్రీకృష్ణమందిరంలో రాత్రి బస చేశారు.యధావిధిగా సోమవారం ఉదయం బయలుదేరి వెళ్లనున్నారు.


సైకిల్‌పై సబ్బవరం చేరుకున్న విజయ్ గోపాలకృష్ణ

నేడు పోలమాంబ తొలేళ్ల ఉత్సవం

- అనుపు మహోత్సవం రేపు
- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం జరగనుంది. స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద తొలేళ్ల ఉత్సవాలు జరపనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అనుపు మహోత్సవం జరగనుంది. ఈ రెండు రోజులూ అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా తెలిపారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే రోడ్డు మార్గాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం జరిగే ప్రధాన పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి తెలిపారు. చలువ పందిరి, ఆలయ ప్రాంగణంలో టెంట్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు వివిధ క్యూలైన్లను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రవేశాలు కల్పించనున్నారు. భక్తులకు మజ్జిగ, మంచినీరు, పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేయనున్నట్టు చైర్మన్ తెలిపారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ.50, రూ.100, రూ.500 దర్శనాలు అందుబాటులో ఉంటాయన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. తొలిపూజ, పంచామృతాభిషేకాలకు రూ.1516 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.


ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లు


విద్యుత్ దీపాలతో పోలమాంబ ఆలయం

ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: తాటిచెట్ల పాలెంలోని శ్రీసత్యసాయి సేవా సంస్థలు, రైల్వే ఏరియా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షకు ఐసీడబ్ల్యూఏఐ భవన్ పక్కన, అక్కయ్యపాలెం హైవే వద్ద గల సత్యసాయిబాబా సాయిసౌధలో కోచింగ్ ఉంటుందన్నారు. ఈ నెల 10 నుంచి మే 13 వరకు శిక్షణ ఇవ్వనున్నారు.